క్లుప్తంగా

అమరవీరుల ఆశయాలను నెరవేర్చాలి

గద్వాల అర్బన్: తెలంగాణ విద్యార్థి అమరవీరుల ఆశయాలు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గంజిపేటలో పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర సాధనలో ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాడి పదేళ్లయినా సందర్భంగా ప్రజల ఆకాంక్షలను నేరవేర్చాలన్నారు. కార్యక్రమంలో బాబు, ఆంజనేయులు, గోపి, వెంకటేష్, మన్యం, ప్రవీణ్, జయన్న, హనుమంతు తదితరులు ఉన్నారు.

ఉద్యమ నాయకుడికి నివాళి

అయిజ: తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు, ఉపాధ్యాయుడు మద్దిలేటి హైదరాబాద్‌లో బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గురువారం మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన మండలంలోని పులికల్‌కు తరలించారు. మార్గమధ్యంలో పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో వివిధ సంఘాల, పార్టీల నాయకులు మృతదేహంకు నివాళులర్పించారు. పులికల్‌లో పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతిమ యాత్రలో ఏబీసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంపు



ధరూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెల రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు గురువారం పూర్తయ్యింది. పాఠశాల మైదానంలో వాలీబాల్, క్రికెట్ తదితర వాటికి శిక్షణ ఇచ్చారు. క్రీడాకారులు శిక్షణ పొందినట్లు జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పీఈటీ శ్రీనివాసులు, టీచర్ సురేందర్ ప్రత్యేక చొరవ చూపారని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ధరూరు: మండలంలోని ఉప్పేరులో కొత్తగా నిర్మిస్తున్న వాల్మీకి ఆలయ నిర్మాణానికి గట్టు మండల సర్పంచ్ సంఘం అధ్యక్షుడు బాసు హనుమంతు నాయుడు రూ.50,016 విరాళాన్ని గురువారం అందించారు. కార్యక్రమంలో సు రేష్, రంగన్న, సంజీవ్‌నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్



ధరూరు: మండల కేంద్రంలో గురువారం పోలీస్ పికెటింగ్ కొనసాగింది. ఇటీవల గద్వాలలో జరిగిన దాడుల పరిణామాల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎస్‌ఐ కర్ణె శేఖర్‌రెడ్డి ముందస్తు పికెటింగ్ ఏర్పాటు చేశారు. 10 మంది పోలీసులు గ్రామంలో గస్తీ నిర్వహిస్తున్నారు. ఎక్కడ కూడా గుంపులు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు.

జోరుగా ఉపాధి హామీ పనులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. గురువారం మల్దకల్, తాటికుంట, కుర్తిరావల్‌చెర్వు, అమరవాయి ఉపాధి హామీ పనులను ఏపీఓ స్వామి, పంచాయతీ ఈఓ మాబీ, టెక్నికల్ అసిస్టెంట్లు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామాల్లో కంటి పరీక్షలు

గట్టు: కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో కంటి పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఆలూరు, మాచర్ల, చమన్‌ఖాన్‌దొడ్డి ప్రజలకు కంటి పరీక్షలను నిర్వహించారు. మొత్తం 404 మందికి పరీక్షలను నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. 24 మందికి అద్దాలను పంపిణీ చేయగా, 32 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, సాయిచరణ్, సమీరాకౌసర్, సీహెచ్ఓ ఊసేని, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ముచ్చోనిపల్లెలో ప్రారంభిస్తున్నట్లు సీహెచ్ఓ తెలిపారు.



టీ హబ్‌తో తగ్గిన భారం

- ల్యాబ్‌లో ఉచితంగా 57 రకాల పరీక్షలు
- రెండేళ్లుగా విస్తృత సేవలు
- వనపర్తి, గద్వాల జిల్లాలో ఏడు వాహనాలతో రక్త నమూనాల సేకరణ



గద్వాలలోని డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాజోళి: ఆస్పత్రులు అంటేనే పేద, మధ్య తరగతి ప్రజలకు కొండంత భారం మీద పడినట్లే. అందులో వ్యాధి తెలియకుంటే దాని వైద్యం కోసం ఎందరో వైద్యుల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. ఎంత మంది డాక్టర్లకు చూపించినా చివరకు వ్యాధి నిర్ధారణ చేయాల్సిందేనని, ల్యాబ్‌లకు పంపుతుంటారు. ఈలోగా రూ.వేలు ఖర్చు చేసేది కాక, తాజాగా ల్యాబ్‌లో వ్యాధి నిర్ధారణ పేరుతో అదనంగా రూ.వేలు ఖర్చు చేసి అప్పుల పాలవతున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీ హబ్ ల్యాబ్(తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్)ల ద్వారా ఉచితంగా 57 రకాల వ్యాధులకు నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇంతే కాక ప్రజలు తమకు అందుబాటులో ఉన్న పీహెచ్‌సీలో రక్తం నమూనాలు ఇస్తే చాలు, ప్రత్యేక వాహనాల్లో ఆ నమూనాలను జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌లకు తరలించి, పరీక్షలు నిర్వహించి, ఆధార్ కార్డు ఆధారంగా వారి ఫలితాలను వెల్లడిస్తున్నారు.

2021 నుంచి ప్రారంభం

ఆధార్ కార్డు ఆధారంగా వైద్య పరీక్షలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ హబ్‌లు 2021 జనవరి 9న ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి పరీక్షలు చేసేందుకు ప్రజలకు అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉంచారు. ఎక్కువగా బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, కిడ్నీ, లివర్‌కు సంబంధించిన వాటితో పాటు, 57 రకాల వ్యాధులకు పరీక్షలు చేస్తున్నారు. ఒకేసారి రోగి నుంచి శాంపిల్ సేకరించి, అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారు. దీంతో వ్యాధుల బారిన పడిన వారే కాకుండా సామాన్యులు కూడా పరీక్ష చేయించుకుని, ఏదైనా అనారోగ్య సమస్య బయటపడితే వాటికి వైద్యం తీసుకుంటున్నారు.

రెండు జిల్లాల్లో 30 కేంద్రాల నుంచి..

గద్వాల, వనపర్తిలోని రెండు జిల్లాల నుంచి 30 కేంద్రాల ద్వారా రక్త నమూనాలను సేకరించి, గద్వాలలోని టీ హబ్ కేంద్రంలో నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. గద్వాల జిల్లాలో 13 కేంద్రాలు, వనపర్తి జిల్లాలో 17 కేంద్రాల ద్వారా సేకరణ చేస్తుండగా, వీటి నుంచి శాంపిళ్ల సేకరణకు ఏడు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. గద్వాల జిల్లాకు 3, వనపర్తికి 4 వాహనాల ద్వారా శాంపిళ్లు సేకరిస్తున్నారు. శాంపిల్ తీసుకున్న వారంలోగానే ఫలితాలు స్థానిక పీహెచ్‌సీలోనే తీసుకునే అవకాశం ఉండటంతో, ప్రజలకు వ్యయ ప్రయాసలు తగ్గుతున్నాయి.

లక్షల సంఖ్యలో ..

సెంటర్ ప్రారంభించినప్పటి నుంచి ప్రజలు ల్యాబ్‌లకు క్యూ కడుతున్నారు. ప్రారంభంలో విషయం తెలియకపోవడంతో పరీక్షలు తక్కువగా చేయగా, తాజాగా పీహెచ్‌సీలు, వైద్య సిబ్బంది ద్వారా సమాచారం తెలసుకున్న ప్రజలు తరుచూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇప్పటికే 2,61,936 మంది రోగులుకు పరీక్షలు చేయగా, 5,92,284 శాంపిళ్లను సేకరించారు. మొత్తం 12,19,304 టెస్టులు చేశారు.

లక్షల సంఖ్యలో టెస్టులు



వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఇప్పటికే లక్షల సంఖ్యలో టెస్టులు చేశాం. ప్రత్యేకంగా ఏడు వాహనాల ద్వారా శాంపిళ్ల సేకరణ చేస్తున్నాం. 2021లో ప్రారంభమైన ఈ సెంటర్ ద్వారా లక్షల మందికి ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. ప్రస్తుతం 57 రకాల టెస్టులు చేస్తున్నాం. ఇలాంటి టెస్టులు బయట చేపిస్తే రూ.వేల బిల్లు అవుతుంది. ప్రజలు కూడా ఈ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకుంటున్నారు.

– రవి కుమార్, టీహబ్ ల్యాబ్ మేనేజర్, గద్వాల

ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్లడం లేదు



ప్రభుత్వం పేదలకు, మధ్య తరగతి వాళ్లకు అందుబాటులో ఉండేలా తీసుకువచ్చిన టీ హబ్ ల్యాబ్ ద్వారా ప్రజలు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లడం లేదు. ప్రస్తుతం ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళితే వైద్య పరీక్షల పేరుతో రూ.వేలు దండుకుంటున్నారు. వ్యాధిని కనుకునేందుకు వైద్యుడి చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ ల్యాబ్ ద్వారా ప్రజలకు డబ్బు, సమయం వృథా కాకుండా కాపాడుకోగలుగుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లో లక్షల మంది టెస్టులు చేయించుకుంటున్నారు.

– నతానియేల్, పెద్ద ధన్వాడ

బీఆర్‌ఎస్ పాలనలో అవమానాలు



మాట్లాడుతున్న మద్దిలేటి

అయిజ: బీఆర్‌ఎస్ పాలనలో దళితులకు అడుగడుగునా అవమానాలే ఎదురవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దిలేటి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు కోసం చేపట్టిన ఉద్యమంలో దళిత బడుగు బలహీన వర్గాల పాత్ర వెలకట్టలేనిదని, ఉద్యమం ఊపందుకోవడానికి దళితులే కీలకం అన్నారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం దళితుడిని మొదటి ముఖ్యమంత్రి చేస్తానని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. అలంపూర్ నియోజకవర్గంలో దళితులకు అవమానాలు జరుగుతున్నాయని వాపోయారు. కార్యక్రమంలో గిత్తల దేవరాజు, సాంబశివుడు, మైనర్ బాబు, దేవేందర్, సులోచనమ్మ, రవీందర్, మధు, పాండురంగరాజు, సత్యానందం, లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ లేక ప్రజల ఇక్కట్లు



ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వరుసగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల వల్ల స్థానికంగా అంబులెన్స్ (108) అందుబాటులో లేకపోవడంతో నిత్యం ప్రజలు ప్రాణాలను కోల్పోతున్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ కోసం స్థానికులు, పోలీసులు ప్రయత్నించినా.. మండలంలో ప్రభుత్వ అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాల్లో క్షతగాత్రులను తరలించాల్సిన పరిస్థితి నెలకొంది.

మండలంలో 50వేల జనాభా పైనే..

మండలంలో మొత్తం 29 పంచాయతీ ఉండగా దాదాపుగా 50వేలకు పైగా జనాభా ఉంది. ఇంత జనాభాకు ఒకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటంతో పాటు 9హెల్త్ సబ్ సెంటర్‌లు ఉన్నాయి. 108 సౌకర్యం మాత్రం స్థానికంగా అందుబాటులో లేదు. ఇక్కడ 44వ జాతీయ రహదారితో పాటు మండల కేంద్రానికి డబుల్ రోడ్డు ఉండటంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదవశాత్తు రోడ్లపై ప్రమాదం సంభవించినా లేక అనారోగ్యం కారణాలతో అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు మండల ప్రజలు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సుమారు 25 కిలోమీటర్ల దూరం నుంచి పెబ్బేరు, గద్వాల ఆస్పత్రులకు చెందిన అంబులెన్స్‌లు రావడంలోపే సగానికి పైగా ప్రాణాలను కోల్పోతున్నారని ప్రజలు వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు విన్నవించాం..



మండలంలో 108 సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని అనేక సార్లు విన్నవించారు. మండల పీహెచ్‌సీలో గల 108 సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యేకు గతంలోనే విన్నవించాం. సమస్యను జిల్లా మంత్రులతో చర్చించి త్వరలోనే అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తాం.

– మాధుర్య, మండల వైద్యాధికారి, ఇటిక్యాల

సభలో ప్రశ్నించని ప్రజాప్రతినిధులు

- సాదాసీదాగా కొనసాగిన మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ రజిత

శాంతినగర్: వడ్డేపల్లి మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీపీ రజిత అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు వారి శాఖాపరమైన తాజా నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. ముగ్గురు ఎంపీటీసీలు, సర్పంచ్ హాజరైన సమావేశంలో సభ్యులు ఎవరూ ప్రశ్నించకపోవడంతో అధికారులు వారి నివేదికలను చదువుతూ సమావేశాన్ని కొనసాగించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తేవాలని పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం నుంచి నిర్వహించే దశాబ్ది ఉత్సవాలను ఆయా పంచాయతీల్లో ఘనంగా నిర్వహించాలని సభ్యులకు ఎంపీడీఓ రవీంద్ర సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఏఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంఈఓ నరసింహులు, డాక్టర్ పుష్పలత, ఎంపీఓ తిరుపతన్న, మిషన్ భగీరథ ఏఈఈ వంశీ, ఐసీడీఎస్ సీడీపీఓ కమలాదేవి, ఏఓ రాధ పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందికి పే స్కేల్ వర్తింపజేయాలి

శాంతినగర్: ఉపాధిహామీ పథకంలో 18ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందికి పేస్కేల్ వర్తింపచేయాలని ఉపాధి హామీ పథకం ఉద్యోగుల సంఘం జిల్లా చైర్మన్ రామలింగేశ్వరప్రసాద్ ప్రభుత్వాన్ని ప్రకటనలో కోరారు. బంగారు తెలంగాణలో అందరూ సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారని, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉపాధిహామీ సిబ్బందికి పేస్కేల్ అమలు చేయాలని కోరారు. పేస్కేల్ వర్తింపజేయాలని కోరుతూ వివిధ జిల్లాల్లోని ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసు లేఖల ద్వారా ప్రభుత్వానికి విన్నవించినట్లు పేర్కొన్నారు.

జాబ్ మేళాను విజయవంతం చేయండి



అయిజ: మండల కేంద్రంలోని బ్రైట్ స్టార్ పాఠశాలలో 11న నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు కోరారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జాబ్ మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మధుగౌడ్, రవి చంద్ర, స్వామిదాస్, నాగరాజు, మహేందర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ చేపట్టండి

అయిజ: ప్రభుత్వం రెండో విడుతలో గొర్రెల పంపిణీ చేయాలని కురువ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సంఘం నాయకులు మండల కేంద్రంలో సమావేశమయ్యారు. ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ మూడవ విడతలో కాకుండా రెండో విడుతలోనే పంపిణీ చేయాలని కోరారు. అనంతరం సీఎం క్యాంప్ కార్యాలయానికి బయలుదేరారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



ఎద్దులను ఊరేగిస్తున్న రైతులు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెలో ఏరువాక పౌర్ణమి పురస్కరంచుకుని గురువారం రైతులు వేడుకలు నిర్వహించారు. సుంకులమ్మ ఆలయానికి మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా గ్రామంలో రైతులు ఎద్దులను అలంకరించి బండ్ల ర్యాలీ నిర్వహించారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు



ఎద్దుకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

శాంతినగర్: వర్షాకాలంలో సంక్రమించే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాశాల డాక్టర్ పుష్పలత తెలిపారు. మండలంలోని రామాపురం, కోయిల్‌దిన్నెలో పశువులకు జబ్బవాపు, గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 56 గేదెలకు, 146 ఆవులు, ఎద్దులకు టీకాలు వేసినట్లు డాక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ వరప్రసాద్, ఎల్‌ఎస్‌ఏ షేక్ లతీఫ్, వీఏ ప్రభాకర్, జీఎంలు లక్ష్మన్న, విద్యాసాగర్ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సన్మానం



సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

గద్వాల అర్బన్: మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోషియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో నల్లకుంటలోని ఉర్దు–ఘర్ మసీద్ షాదీఖానలో హజ్‌కు వెళ్తున్న వారిని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోషియేసన్ జిల్లా అధ్యక్షుడు బషీర్ అహ్మద్, జనరల్ సెక్రటరీ మహ్మద్ కలీమ్‌లు మాట్లాడుతూ హజ్ యాత్రకు క్షేమంగా వెళ్లి రావాలని కోరారు. కార్యక్రమంలో మహిబూబ్, ఇస్మాయిల్, ఇబ్రహీం, వసీం తదితరులు ఉన్నారు.

క్రీస్తు మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న ఏఆర్ పాల్‌సన్

స్టేషన్ మహబూబ్‌నగర్: క్రీస్తు మార్గంలో నడిస్తే జీవితాలు మారుతాయని జంగారెడ్డిగూడెంనకు చెందిన పాస్టర్ ఏఆర్.పాల్‌సన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నుంచి జీసస్ పవర్ అపోస్టలిక్ మినిస్ట్రీస్ దాసరి సోదరుల ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ రీట్రీట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాస్టర్ క్రీస్తూ సందేశం ఇచ్చారు. చిన్నారులు దైవమార్గాన్ని అనుసరిస్తే సమాజంలో మంచి పౌరులుగా, సమాజానికి మంచి చేసేవారిగా నిలబడుతారని అన్నారు. అనంతరం గుంటూర్‌కు చెందిన పాస్టర్ సాదు సుందర్ సింగ్, రాజమండ్రికి చెందిన జాన్‌సన్ సందేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా బైబిల్ కథలు, దేవుని పాటలు, మ్యాజిక్‌షో, చిన్నారులకు బైబిల్ క్విజ్, కంఠతా వ్యాఖ్యలు, పప్పెట్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాబర్ట్‌వెస్లీ బృందం ఆధ్వర్యంలో భక్తిగీతాలు ఆలపించారు. శుక్రవారం నుంచి రెండు రోజులపాటు ఆశీర్వాద కూడిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ పాస్టర్లు డానియల్ సుధీర్, పరియన్, నిర్వాహకులు దాసరి సుందర్, దాసరి ప్రసాద్, దాసరి సామ్యేల్, కిరణ్, ప్రభాకర్, బెంజిమెన్, మెల్కిసెదెక్, గుర్రం అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవతరణ దినోత్సవానికి ముస్తాబు



ధరూరులో ముస్తాబైన రైతువేదిక, పంచాయతీ కార్యాలయాలు



ఉండవెల్లి తహసీల్దార్ కార్యాలయంలో తోరణాలు కడుతున్న వీఆర్‌ఏలు



లైట్ల వెలుగులో ఉండవెల్లి పంచాయతీ కార్యాలయం



జల్లాపురంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

మానవపాడు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైతు దినోత్సవ ఏర్పాట్లను గురువారం అడిషనల్ డీఆర్‌డీఓ నాగేంద్రం, ఎంపీడీఓ రమణారావు మండలంలోని బోరవెల్లి, జల్లాపూర్, కలుకుంట్ల, మద్దూరులో ఉన్న రైతువేదికలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం గ్రామాలలో ఈ నెల 3వ తేదీ నుంచి రైతు వేదికల్లో రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించాలని తెలిపారు. రైతువేదికలను పరిశుభ్రంగా ఉంచి, ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని సర్పంచ్‌లు, కార్యదర్శులను ఆదేశించారు.

కార్యాలయాల ముస్తాబు

ధరూరు: రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం ఉదయం జెండా కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ, తహసీల్దార్, హాస్టల్, పంచాయతీ, రైతు వేదిక తదితర కార్యాలయాలు ప్రత్యేక లైటింగ్‌తో వెలిగిపోతున్నాయి.

కార్యాలయాలకు వెలుగులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు, రైతు వేదికలకు, ముస్తాబు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏలు అలంకరణ చేశారు. రాత్రి వేళలో ప్రభుత్వ కార్యాలయాలకు లైట్లతో అలంకరించారు.

శాంతినగర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతువేదికల్లో శనివారం రైతు దినోత్సవం నిర్వహించాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాధ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు రైతులందరిని సమావేశ పరచాలని ఏఈఓలకు సూచించారు.